కథావేదిక

# శృంగార శుభవేళ

- మన్నె సత్యనారాయణ

''మావా .. రైకల పండగొస్తాంది కదా!'' అంది సింగి తలొంచుకుని సంశయంతో.

రంగడామె వంకాశ్చర్యంగా చూసాడు. తనంటే ఇష్టపడి, అందర్నీ ఎదిరించి మనువాడింది. అలాంటి సింగి మరోడితో పొందుకోసం అప్పుడే ఎదురుచూస్తోందా అనుకున్నాడు.

అయితే అతనికి ఈర్ష్యకాని, బాధకాని కలగలేదు. ఎందుకంటే, వాళ్ల సంఘంలో అది తప్పుకాదు. పైగా, తప్పనిసరి! అందరికీ తప్పనిసరి కనుక, మామూలు విషయమే!

''అప్పుడే నామీద మొహం మొత్తిందేంటే సింగీ, కొత్త సుకం కోసం సూత్తన్నావ్!'' అన్నాడు సరదాగానే.

సింగి చివాలున చేయెత్తి అతని నోరు నొక్కింది. ''అలాంటి మాటనకు మావా. రైకల పండగలో కలవడం నాకిస్టం నేదు'' అంది.

ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు రంగడు.

''సిగ్గుపడకే సింగీ. మన కులంలో (సంఘంలో) ఇది మామూలేగా! నేనేటీ అనుకోను'' అన్నాడు.

''ఒద్దు మావా ! నేనొప్పను. నీవు నా పెనిమిటివి. నీవు తప్ప నా ఒంటిమీద మరోడి సెయ్యిపడ్తే నే సయించను. తప్పుకునే దారి సెప్పు'' అంది దృఢంగా.

ఆమె మనస్ఫూర్తిగానే అంటోందని అర్థమైంది రంగడికి. తన భార్య మరోడి చేతిలోకెళ్లకుండా వుండడం అతనికీ ఇష్టమే. కాని... ''కాని సింగీ, ఇది తాతల్నాటి కట్టుబాటు! ఒగ్గడానికి కులం వొప్పదు. రైకల పండగలో కలవనంటే ఎలేత్తారు. ఊరిడిసి పోవాలి'' అన్నాడు.

''ఎలేత్తే ఎయ్యనీ. ఊరిడ్సిపోయి, కూలీ నాలీ నేసుకు బతుకుదాం. అంతేకాని నా ఒల్లు మరోడ్ని తాకనివ్వను'' అంది.

రంగడి మనసు అనంతమైన తృప్తితో పరిపుష్టమైంది! తన భార్య, తన యెడల సంపూర్ణమైన నిబద్ధతతో వుండడం కోసం, సమాజాన్ని ప్రతిఘటించి తలిదండ్రుల్నీ, ఆస్తినీ వదులుకొని కూలి చేసుకుని బ్రతకడానికి సిద్ధపడుతోందంటే- అతని భర్తృత్వమూ, బ్రతుకూ మన్నన పొందాయి!

''అనాగే, నీ ఇస్టమైనట్టే సేద్దాం. అయినా, మీ అత్త నోసారడిగి సూడు. తెలివైంది. ఏదైనా దారి సెప్పుద్దేమో'' అన్నాడు.

నిజమేననిపించింది సింగికి. మేనత్త చెంగమ్మ తెలివైందీ, చురుకైందీ కూడా. ఏదైనా సలహా చెప్పొచ్చుననుకుంది.

మర్నాడు చెంగమ్మ ఇంటికెళ్లి, చెప్పుకొంది సింగి.

''అత్తా, రైకల పండగలో కలవడం నాకిస్టం నేదు...'' అని తన మనసులోని మాట చెప్పుకుంది.

చెంగమ్మ కూడా మొదట్లో రంగడనుకున్నట్లే అనుకుంది. ''ఓసీ! మొదట్లో అనాగే అంటాది పతీ ఆడదీ, నాకు తెల్దేటి! మన కులంలో ఆడా, మగా అందరూ ఆరోజున దొరికే కొత్త సుకం కోసం ఎదురు సూత్తూనే వుంటారు'' అంది నవ్వుతూ.

''నేదత్తా, నిజవే సెబుతున్నా. నాకిస్టం నేదు. నా మనసొప్పదు. ఆడు నా పెనిమిటి- నా పేనం. ఆడు తప్ప మరోడు నామీద సెయ్యేత్తే, నా తనువే మైల పడిపోద్ది. కులం ఎలేత్తే, బైటకుపోయి కూలి సేసుకు బతుకుతాం. ఏదైనా దారి సెపుతావనొచ్చాను'' అంది దృఢంగా.

ఈ విషయంలో తన ఆలోచనలు వేరైనా, మేనకోడలి శుద్ధమైన అంతరంగాన్ని మెచ్చుకుంది చెంగమ్మ!

''నీలాంటి ఆడోళ్లు సానా తక్కువుంటారే సింగీ! మంచి మనసు నీది. కాని, నేను మాత్రం ఏటి సెప్పగల్ను? నీవూ రంగడూ కలిసెల్లి కులం పెద్దను అడిగి సూడండి. జాలిపడి ఏదైనా ఉపాయం సెపుతాడేమో!'' అంది.

• • •

ఆ ఏనుగు కొండ రక్షణలో, ఆ యేరు సెలయేరుల సాక్షిగా, ఎన్నో తరాలుగా అక్కడ బ్రతుకున్నదో గిరిజన పల్లె- దొరవలస! ఆ గిరిజనులది భిన్నమైన సంస్కృతి! సాంప్రదాయాలే వారి సామాజిక శాసనాలు!

సింగి, ఆ పల్లెకే సింగారం అనిపించేటంతటి అందమైన పిల్ల! ఇప్పుడామెకిర్వై యేళ్లు.

సింగి, రంగడూ పిచ్చిక గూళ్లు కట్టుకునే వయసు నుండీ కలిసి ఆడారు, మెలిసి తిరిగారు.

శారీరకంగానూ, మానసికంగానూ స్త్రీ పురుషుని కంటే ముందుగా వికసిస్తుంది! సింగి తొలి యవ్వనంలో ఆమె ఎద మీద ఎదిగిన గుబ్బల పొంగుల్ని ఆకళింపుగా చూసేవాడు రంగడు. ''ఏటిరా, అలా సూత్తావ్?'' అనేది సింగి. కాని ఆమెకు తెలుసు!

రంగడు కొద్దిగా కంగారుపడేవాడు. ''...ఏటీ నేదు... నీ గుండెమీద గుళ్లోపేరు ఎగిరెగిరి పడుతూంటేనూ!...'' అనేవాడు నవ్వుతూ.

ఒకనాడు గడ్డ ఒడ్డున ఏటి ఒడ్డున రంగడు వెదురు కర్ర చెక్కుతూ వుంటే, ''రంగా! పేమ అంటే ఏటిరా?'' అంది.

''ఓసీ పేమంటే తెలవదా! పేమంటే- నీవంటే నాకు ఇది కదా!... మరి నేనంటే నీకు అది కదా!... ఆ 'ఇదే' పేమ అంటే!'' అన్నాడు కాస్త తంటాలు పడుతూ.

''ఆ 'ఇది' అంటే ఏటో ఇడమర్సి సెప్పలేవు! నే సెప్పనా?'' అని కిలకిలా నవ్వింది. అటూ ఇటూ చూసింది. రంగడి బుగ్గమీద గట్టిగా ఓ ముద్దు పెట్టింది. ''ఇదే పేమ అంటే!'' అనేసి తుర్రుమంది క్కడ్నుంచి.

పెళ్లీడొచ్చాకా, రంగడ్నే మనువాడతానంది. ఆమె తండ్రి ఒప్పుకోలేదు. అతనికి నాలుగెకరాల భూమి వుంది.

''రంగడికి మానెడు భూవి కూడా నేదు. పెళ్లాన్నెలా బతికిత్తాడేంటి?'' అన్నాడు.

సింగి చెప్పుకుంది. బతిమాలుకుంది. మేనత్త చెంగమ్మచేత చెప్పించింది. ఎలాగైతేనే, తల్లినీ తండ్రినీ ఒప్పించుకుని రంగడ్ని మనువాడింది!

మనువాడిన నాటి రాత్రి రంగడు ''సింగీ, తామరాకుల్తో చెప్పులు కుట్టించి నిన్ను నడిపించుకుంటానే!'' అన్నాడు కృతజ్ఞతతో. అలాగే పెళ్లాన్ని అపురూపంగా చూచుకుంటున్నాడు.

సింగి, రంగడి పెళ్లి తర్వాత వచ్చిన మొదటి రవికల పండుగది. ఆ పండుగ రోజు రాత్రి వెన్నెల్లో, విరాగితులైన స్త్రీపురుషులందరూ ఆ పల్లెలోని ఒక ఖాళీ ప్రదేశానికి చేరతారు. స్త్రీలంతా తమ ఒంటిమీద రవికల్ని తీసేసి చీకటిగా వున్నచోట ప్రోగుగా వేస్తారు. పురుషులొక్కొక్కరే వెళ్లి ఒకో రవిక తీసుకొస్తారు. ఆ రవిక ఎవరిదైతే ఆ స్త్రీ ఆ పురుషుడూ ఆ రాత్రి గడుపుతారు. ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా, అందరూ ఈ వేడుకలో పాల్గొనాల్సిందే! అవివాహితులైన వారికిందులో ప్రవేశముండదు.

''ఈ పండగ పేరుతో తన శరీరాన్ని పర పురుషునికి స్వాధీనపరచడం ఇష్టంలేకనే సింగికా ఆందోళన!

• • •

చెంగమ్మ సలహా ప్రకారం సింగి, రంగడూ కుల పెద్ద దగ్గరకెళ్లి అంతా చెప్పుకున్నారు. కులపెద్ద కాశ్చర్యమే! తన డబ్బై ఏళ్ల వయసులో, తమ కులంలో ఏ ఆడదీ ఇలా కోరలేదు. పైగా ఆరోజు కోసవే చూస్తారంతా అనుకున్నాడు. తప్పించాలని అతనికున్నా-

''ఏనాగే సింగీ? ఎన్నో తరాల్నుంచీ వత్తావున్న కట్టుబాటు కదా ఇది! ఇప్పుడు నీ ఒక్కదానికీ మినహాయింపిత్తే, తర్వాత పతీ మొగోడూ తన పెళ్లాంచేత ఇలాగే చెప్పిత్తాడు. అంచేత నేనేం సెయ్యలేను'' అన్నాడు.

సింగి, రంగడూ తల్లిదండ్రుల్నీ, కులాన్నీ, ఆస్తినీ విడిచి ఊరొదిలి పోయి, కూలి చేసుకుని బతుకుతావన్నారు! కాని ఆమె తల్లి, తండ్రి, మేనత్త బలవంతం

గానే ఆపుచేసారు.

రవికల పండుగ రోజొచ్చింది. ఆ రాత్రి వెన్నెల్లో, ఊరికి చేరున్న ఓ ఖాళీ ప్రదేశంలో వివాహిత స్త్రీపురుషులందరూ చేరారు. మగాళ్లంతా ఒకవైపు, స్త్రీలు దూరంగా మరోవైపునా కూర్చున్నారు. కుల పెద్దలు ఇద్దరు ముగ్గురు మధ్యలో కూర్చున్నారు.

ఆడవాళ్లంతా తమ ఒంటిమీదున్న రవికల్ని తీసేసి, ఆ ప్రక్కనే వున్న ఓ చిన్న గదిలో వేసారు. కుల పెద్ద పురుషుల్లో ఒక్కొక్కర్నే పిలుస్తున్నాడు.

ముందుగా ఒక యువకుడి వంతొచ్చింది. అతను లేచి గదిలో కెళ్లాడు. గదిలో పూర్తిగా చీకటి. అందువలన ఏ పురుషునికీ తనకిష్టమైన స్త్రీ యొక్క రవిక ఎంచుకోడానికి వీలుండదు. అతను చేతికొచ్చిన రవిక తీసుకుని బైటకొచ్చాడు. పెద్దల ముందు ఆ రవికను వెన్నెట్లో ప్రదర్శించాడు. అది తనదేనంటూ ఒక యువతి ముందుకొచ్చింది. వాళ్లిద్దరూ సంతోషంగా కలిసి వెళ్లిపోయారు.

అలాగే, రెండుమూడు జంటలు వెళ్లారు. సింగి బిక్కుబిక్కుమంటూ కూర్చుంది. ఈ రాత్రితో తన మనసులోని మంచి మైలపడిపోద్ది. మరో మగాడి చేతిలో నలిగిపోయిన ఈ తనువుని విశ్వాసంతోనూ, ప్రేమతోనూ తన పెనిమిటికెలా సమర్పించడం? ఇదీ ఆమె అంతరంగంలోని వేదన. ఈసారి కులపెద్దల పిలుపుతో ఓ పాతికేళ్ల యువకుడు లేచాడు. అందంగా ఆరోగ్యంగా వున్నాడు. కండలు తిరిగి బలంగా వున్నాడు. పురుషాతిశయంతో నడిచి ఆ గదిలోకెళ్లాడు. తన చేతికొచ్చిన ఓ రవిక తీసుకుని బైటకొచ్చి ప్రదర్శించాడు.

చెంగమ్మ చిన్నగా నవ్వుతూ రవిక తనదేనంటూ ముందుకొచ్చింది. ఆ యువకుని కాశ్చర్యం! అతనాశ్చర్యం నుండి తేరుకునేలోగానే, అతని చెయ్యందుకుని నడిపించుకుంటూ వెళ్లిపోయింది చెంగమ్మ.

ఇద్దరూ చెంగమ్మ ఇంటికెళ్లారు. కోరుకున్నదే దొరికినట్లు హుషారుగా వుంది చెంగమ్మ. అతను మాత్రం ఆలోచనలతో, సంశయంతో వెనకాడుతున్నాడు.

''ఏటిరా, సిగ్గుపడిపోతన్నావ్ ఆడపిల్లనాగా!'' అందామె. ఆమె వయసులో అతనికంటే బాగా పెద్దది. చిన్నప్పట్నుంచీ అతనికామె చనువే. అతనికామె ఆట, పాట, పని మప్పింది.

''ఏటీ నేదు. సిన్నప్పట్నుంచీ నాకు ఆటా, పని మప్పిందానివి కదా! నాకంటే ఏడెనిమిదేళ్లు పెద్దదానివి. మరి... మనిద్దరం'' అని నసిగాడు.

''అందుకని! నీవేమన్నా నా పిన్నమ్మ కొడుకువా? మనకేదైనా రత్తసంబందముందా?'' అంది.

''కాదనుకో...'' అంటూ నసిగాడు.

''ఏటీ కాదు. సూడు! నీకు పాతికేళ్లు. కోడె వయసు నీది! నడిమి వయసు నాది. ఆడదానిదిప్పుడే అందం! మనిద్దరి మద్దెనా ఇంకేటి కావాలి! అందొచ్చిన రేతిరిది! ఈ రాతిరి మరి రాదు మనకు. ఈ ఎన్నెట్లో నా ఒంటి సొంపు సూడు. నీ బతుకు పండుద్ది. ఎవరూ లేరిక్కడ. మనిద్దరమే. శెంకలు మాను. నా తనువేలుకో!...'' అంటూ లాలసతో, అతన్లో రసభావన కలిగిస్తూ, తానే చొరవ తీసుకుని ఆ యువకుడ్ని గుండెల కదుముకుంది!

అతనిలోని సంశయాలు తొలిగిపోయాయి. ఆమె యొక్క ప్రౌఢ శరీరంలోని పరువాల ఒత్తిడికి, అతనిలోని పురుషుడు స్పందించి విజృంభించాడు. సెలయేటి వేగంతో అతనామె దేహాన్ని ఆక్రమించాడు!

యువకుల్లోనూ, నడిమి వయసు వాళ్లలోనూ కొందరు, సింగి ఆ రాత్రి తమకు దక్కాలని ఆశిస్తున్నారు. పల్లెకే అందమైన ఫడుచామె!

తరువాత వంతు రంగడికొచ్చింది. నిరుత్సాహంగా లేచి నిలబడ్డాడు. తానెంతో అపురూపంగా చూసుకునే సింగి ఈ రేతిరి... అనుకున్నపుడతని మనసు కుతకుతమంది.

మెల్లగా గదిలోకెళ్లి చేతికందిన రవిక తీసుకుని బైటకొచ్చాడు. రవికను పెద్దలముందు ప్రదర్శించాడు.

భూగర్భం నుండి పైకి ఎగదన్నే జలధారలాగా, సింగి ఎగిరి గంతేసిందా వెన్నెల్లో!

కులాన్నీ, తరతరాల కట్టుబాటునీ నా అంతరంగ బలంతో జయించాను! అనే భావంతో, తన భాషలో అరవాలనిపించిందామెకు. ప్రవాహం కన్నా వేగంగా ఒక్క పరుగున వచ్చిపడింది పెనిమిటి దగ్గరకు!

రంగడాశ్చర్యం నుండి తేరుకునేలోపునే లావణ్యయై, లతయై అతన్ని పెనవేసుకుపోయింది!

వెయ్యి మాలతీ లతలు తమమీద పూలవర్షం కురిపించిన అనుభూతి కలిగింది వాళ్లిద్దరికీ!

రంగడి నడుం చుట్టూ తన చేయి పెనవేసి, వడివడిగా నడిపించుకుని సింగి తమ ఇంటివైపు వెళ్లింది.

''పండుగనాడు కూడా పాతమొగుడే సింగికి!'' అందొక నడివయసామె.

''పండగనాడు కూడా సింగి రంగడికే దక్కింది!'' అన్నాడో యువకుడు, కాస్త నిరాసగా.




''అది సింగి మనసు బలం! సింగి మొగుడ్నే కోరింది. మంచినే కోరింది. అందుకే సింగికి మొగుడూ దక్కాడు, మంచీ దక్కింది- పండుగనాడు కూడా!'' అన్నాడు కులపెద్ద.

సాహిత్యాభినివేశం కలిగిన ఎవరికైనా, ఈ సంగతి వింటే, ఏమనిపిస్తుందంటే- ''ఆమె ప్రపంచాన్నే శాసించగలదు! ఆమె రాజవంశంలో పుట్టలేదు. రాచనగరులో పెరగలేదు. అయినా, ఆమె అంతరంగంలోని అమాయక ప్రేమ ఆమెకా అధికారాన్నిచ్చింది!'' అని గురజాడ అప్పారావుగారు వ్రాసిన మాటలు నిజమనిపిస్తుంది!

★